
సాక్షి
విజయనగరం
సోమవారం । 29 । జనవరి । 2024



ఆక్వా రైతుకు బీమాతో ధీమా
ఆక్వాసాగుకు ప్రభుత్వం అండగా ఉండడంతో సాగు విస్తీర్ణం అమాంతం పెరిగింది.
- 8లో



బహుముఖ ప్రజ్ఞాశాలి అబ్బూరి
తెలుగు సాహిత్యంలో మరుగునపడిన మాణిక్యం అబ్బూరి అని కేంద్రసాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ సి.మృణాళిని కొనియాడారు.
- 8లో



గురుకులానికి ఆహ్వానం
పేద, మధ్యతరగతి, ఆర్థికంగా వెనుకబడిన సామాజికవర్గాల్లోని పిల్లలు చదువుకోవాలనుకునేవారిని గురుకులం రారమ్మని పిలుస్తోంది.
- 8లో

న్యూస్‌రీల్

జేసీగా కార్తీక్

- జేసీ మయూర్ అశోక్ బదిలీ



జిల్లాకు కొత్తగా వస్తున్న జేసీ కె.కార్తీక్

విజయనగరం అర్బన్: జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్‌కు విశాఖ జేసీగా బదిలీ అయింది. ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా జేసీగా పని చేస్తున్న కె.కార్తీక్ జిల్లాకు జేసీగా వస్తున్నారు. ఈయన ఐఏఎస్ - 2020 బ్యాచ్‌కు చెందిన వారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఐఏఎస్ బదిలీల్లో కార్తీక్‌కు విజయనగరానికి నియమించింది. జిల్లాలో ప్రస్తుతం జేసీగా పని చేస్తున్న మయూర్ అశోక్ 2020 జూన్ 10న హౌసింగ్ శాఖ ఏజేసీగా వచ్చారు. అప్పట్లో ఉమ్మడి విజయనగరం జిల్లాకు నలుగురు జేసీలు ఉండేవారు. 2022లో జిల్లా విభజన తరువాత విజయనగరం కొత్త జిల్లాకు పూర్తి స్థాయి జేసీగా ఆ ఏడాది ఏప్రిల్ 4న బాధ్యతలు చేపట్టారు. ఈయన బాధ్యతలు తీసుకొన్న తొలినాళ్లలో భోగాపురం విమానాశ్రమం భూసేకరణ పనుల వేగం పెంచారు. కోర్టు వివాదాలను త్వరితగతిన పరిష్కరిస్తూ మరో వైపు భూసేకరణలో కోల్పోయిన ఊళ్లు, ఇళ్లు పునర్నిర్మాణ పనులు పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించారు. విశాఖ నుంచి రాయపూర్ వెళ్లే నూతన గ్రీన్‌కోర్ జాతీయ రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన భూసేకరణ త్వరితగతిని పూర్తి చేయడంపై శ్రద్ధ చూపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వినూత్న పద్ధతులు పాటించి రైతులకు బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకొని ఆదర్శంగా నిలిచారు.

జాతీయ సైన్స్ పోటీల్లో విద్యార్థుల సత్తా



బాలభవన్ విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

రాజాం : స్థానిక బాలభవన్‌కు చెందిన ఎ.అమిత్, ఇ.షన్ముఖసాయి (9వ తరగతి), ఎస్.కోమలసాయిబాలజీ(8వ తరగతి) జాతీయ సైన్స్ పోటీల్లో తమ సత్తా చాటారు. ఈ నెల 23 నుంచి గుజరాత్‌లో జున్నాగడాలో జరిగిన జాతీయ సైన్సు పోటీల్లో రాష్ట్రం నుంచి ఈ విద్యార్థులు పాలొన్నారు. బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ ప్రాజెక్టును పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో పాటు డయాగ్రామ్స్‌తో ప్రదర్శించారు. వీరి ప్రదర్శన ప్రథమ స్థానంలో నిలిచినట్టు బాలభవన్ పర్యవేక్షకులు సుంకరి రమేష్ ఆదివారం తెలిపారు. విద్యార్థులకు బాలభవన్ గుజరాత్ రాష్ట్ర డైరెక్టర్ నానాబాయీ, బాలభవన్ జాతీయ డైరెక్టర్ రుషిసింగ్ మెమెంటోలు అందజేశారు. వీరిని విజయనగరం డీఈఓ, డిప్యూటీ ఈఓలతో పాటు రాజాం ఎంఈఓలు, వరలక్ష్మీ సెయింటాన్స్ స్కూల్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు, రేపు జిల్లాలో మంత్రి బొత్స పర్యటన



విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమ, మంగళవారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి సోమవారం ఉదయం 10 గంటలకు చీపురుపల్లి కనక దుర్గమ్మ ఆలయం వద్ద ఉన్న మైదానంలో వైఎస్సార్ ఆసరా మొత్తాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. మంగళవారం ఉదయం 10 గంటలకు గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వైఎస్సార్ ఆసరా మొత్తాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం విజయవాడ బయలుదేరి వెళ్తారు.

జాయింట్ కలెక్టర్‌గా అంబేడ్కర్ నియామకం



ఆర్.గోవిందరావు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఐఏఎస్‌లను బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జాయింట్ కలెక్టర్‌గా విధులను నిర్వహిస్తున్న ఆర్.గోవిందరావును సర్వే సెటిల్‌మెంట్ ఆండ్ ల్యాండ్ రికార్స్ శాఖకు అడిషనల్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. ఆయన స్థానంలో జేసీగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను నియమించింది. ప్రస్తుతం ఆయన డైరెక్టర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ ఈఓ జాయింట్ సెక్రటరీ గవర్నమెంట్ రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. పార్వతీపురం జేసీగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

వైద్య శాఖలో.. ఉద్యోగ విప్లవం

వైద్య రంగంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన మార్పులు రోగులకు మెరుగ్గా వైద్య సేవలు అందేలా తోడ్పడుతున్నాయి. వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆస్పత్రికే వెళ్లాలన్న ఆలోచన రోగుల్లో వికసించింది. ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు.

- వేలాది పోస్టులు భర్తీ చేసిన ప్రభుత్వం
- పీహెచ్‌సీ నుంచి జిల్లా ఆస్పత్రి వరకు అన్నింటా పోస్టుల భర్తీ
- నాలుగున్నరేళ్లలో 2400 మందికి ఉద్యోగాలు
- జీరో వేకెన్సీ పాలసీ ద్వారా ఎప్పటికప్పుడు ఖాళీల భర్తీ
- రోగులకు మెరుగైన వైద్య సేవలు

విజయనగరం ఫోర్ట్:

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టింది. నాడు - నేడు ద్వారా ఆస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దింది. ఆస్పత్రుల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించింది. ఈ క్రమంలో ప్రభుత్వ ఆస్పత్రులకు రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఆధునాతన 108 అంబులెన్సుల ద్వారా సకాలంలో రోగులను ఆస్పత్రికి చేర్చి ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా రోగుల ఇళ్ల వద్దకే వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో ప్రసవానంతరం తల్లీబిడ్డలను తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా సురక్షితంగా ఇంటికి చేర్చుతున్నారు. ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టింది. ఒక్క మాటలో చెప్పాలంటే వైద్య రంగంలో ఉద్యోగ విప్లవం తెచ్చి ఓ చరిత్ర జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించారు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ల్యాబొరేటరీలో పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

వేలాది మందికి ఉపాధి

వైద్య శాఖలో వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించి వారి జీవితాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారు. 2019 నుంచి ఇప్పటివరకు 2400 మందికి ఉద్యోగాలు కల్పించారు. వార్డు బాయ్ దగ్గర నుంచి స్పెషలిస్టు డాక్టర్ వరకు అన్ని కేడర్ల పోస్టులను భర్తీ చేశారు.

జీరో వేకెన్సీ పాలసీతో ఖాళీల భర్తీ



గతంలో వైద్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు ఏళ్ల తరబడి భర్తీ చేసేవారు కాదు. రెండు, మూడు పీహెచ్‌సీలకు ఒక వైద్యుడు సేవలు అందించేవాడు. రెండు, మూడు పీహెచ్‌సీలకు ఒక ల్యాబ్‌టెక్నీషియన్ సేవలు అందించేవారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను, ముగ్గురు స్టాఫ్‌నర్సులను నియమించింది. ప్రతి పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించారు. జీరో వేకెన్సీ పాలసీ తీసుకొచ్చి పోస్టుల కొరత లేకుండా పోస్టులను భర్తీ చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ, వైద్య విధాన్ పరిషత్, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వేలాది పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది.

పారదర్శకంగా పోస్టుల భర్తీ

వైద్య శాఖలో పోస్టులన్నీ ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా భర్తీ చేసింది. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంఎన్‌ఓ దగ్గర నుంచి డాక్టర్ వరకు నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా పోస్టులను భర్తీ చేశారు. వేలాది పోస్టులు భర్తీ చేసినప్పటికీ ఎక్కడా అవకతవకలకు లేకుండా చర్యలు తీసుకున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

వైఎస్సార్ విలేజ్ క్లినిక్, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల్లో ప్రభుత్వం సీహెచ్‌ఓ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్)ను నియమించింది. వీరు గ్రామ స్థాయిలో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులను ప్రభుత్వం నియమించింది. వీరిలో ఒకరు పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించగా మరొకరు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొని గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీల్లో 24గంటల పాటు వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఏ సమయంలో వెళ్లినా రోగులకు వైద్యం అందుతుంది. అదేవిధంగా ప్రసవాలు కూడా పీహెచ్‌సీల్లో నిర్వహిస్తున్నారు.



అరుంధతీనగర్ యూపీహెచ్‌సీలో సేవలు అందిస్తున్న స్టాఫ్‌నర్సు

చాలా ఆనందంగా ఉంది



108 అంబులెన్సులో పైలెట్‌గా నాకు ఉద్యోగం వచ్చింది. 2020 నుంచి పని చేస్తున్నాను. జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల నాకు ఉద్యోగం వచ్చింది. ఆయన మేలు నేను మరిచిపోలేను. 108 అంబులెన్సులో పని చేయడం చాలా ఆనందంగా ఉంది.

– సిరపురపు సతీష్, పైలెట్, 108 అంబులెన్సు

జనరల్ డ్యూటీ అటెండెంట్‌గా..



నేను ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నాను. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాకు జనరల్ డ్యూటీ అటెండెంట్‌గా వచ్చింది. ఏడాది క్రితం నాకు ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో నేను పని చేస్తున్నాను.

– జి.పవన్, జనరల్ డ్యూటీ అటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

ఖాళీలు ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నాం..



ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో వైద్య శాఖకు సంబంధించి 2వేలకు పైగా పోస్టులను భర్తీ చేసింది. ఎక్కడ పోస్టు ఖాళీ అయినా వెంటనే భర్తీ చేసేస్తున్నాం. దీంతో పోస్టుల కొరత అనే మాట వినిపించడం లేదు. సిబ్బంది పెరగడం వల్ల వైద్య సేవలు కూడా బాగా మెరుగుపడ్డాయి.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

2019 నుంచి ఇప్పటి వరకు భర్తీ చేసిన పోస్టుల వివరాలు

కేడర్	పోస్టుల సంఖ్య
ప్రత్యేక వైద్యులు	23
మెడికల్ ఆఫీసర్లు	49
ఏఎన్‌ఎంలు	591
స్టాఫ్‌నర్సులు	278
ల్యాబ్ టెక్నీషియన్స్	80
ఫార్మసిస్టు	72
ఇతర పోస్టులు	147
క్లాస్ ఫోర్ పోస్టులు	279
డేటా ఎంట్రీ ఆపరేటర్స్	33
ఎంఎల్‌హెచ్‌పీలు	604
థియేటర్ అసిస్టెంట్లు	35
కౌన్సిలర్లు	04
బయోమెడికల్ ఇంజినీర్స్	5
108, 104 సిబ్బంది	200

31న సీతంలో రీజనల్ జాబ్ మేళా

- ప్రారంభించనున్న మంత్రి బొత్స



ప్రచార వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం అర్బన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 31న ఉత్తరాంధ్ర స్థాయిలో స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో రీజనల్ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు సీతం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు తెలిపారు. ఈ మేరకు ప్రచార పత్రాన్ని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదివారం విశాఖలోని విడుదల చేశారు. రీజనల్ జాబ్ మేళాలను విడుదల చేశారు. రీజనల్ జాబ్ మేళాలో ఐటీ సెక్టారీ, ఫార్మా, మెన్యాక్చరింగ్, ఆటోమొబైల్, బ్యాంకింగ్ మరియు పైనాన్స్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, రిటైల్, మార్కెటింగ్, లాజిస్టిక్స్, రిటైల్ జ్యూవలరీల తదితర 87 బహుళజాతి కంపెనీలలోని 5,892 ఖాళీలను భర్తీ చేస్తారని పేర్కొన్నారు. మేళాకు పదవ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకావొచ్చని తెలిపారు. స్కిల్ యూనివర్స్ లింక్‌లో, స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు విశాఖపట్టణం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉద్యోగ అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థుల ప్రతిభను బట్టి రూ.15 వేల నుంచి 60 వేల వరకు వేతనాలు ఉంటాయని తెలిపారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి, రీజనల్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారిణి రోహిణి, విజయనగరం జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావు, విశాఖ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయికృష్ణ చైతన్య, ప్లేస్మెంట్ అధికారులు రమేష్, భాస్కర్‌లు పాల్గొన్నారు.

డంఖేషావలీ ఉత్సవాలు ప్రారంభం



విద్యుత్ అలంకరణలలో డంఖేషావలీ బాబా ఆలయం

విజయనగరం టౌన్: స్థానిక కోట జంక్షన్ వద్దనున్న హజరత్ సయ్యద్ డంఖేషావలీ బాబా ఆలయ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దర్గా దర్బార్ నిర్వాహకులు షేక్ చోటా బహదూర్ ఆధ్వర్యంలో బాబాకు విశిష్ట పూజలు నిర్వహించారు. ఉదయం దివ్య ఖురాన్ పఠనం చేశారు. సాయంత్రం ఫాతేహా ఖానీ, రాత్రి లంగర్ నిర్వహించారు. ఈ సందర్భంగా బహదూర్ మాట్లాడుతూ సోమవారం ఖురాన్ పఠనం అనంతరం హజరత్ సయ్యద్ డంఖేషావలీబాబా ఖాదిమ్‌ను ఇంటి నుంచి చాదర్ సందల్ షరీఫ్‌లతో ఫకీర్ మేళా ఖవ్వాలితో నగర వీధుల మీదుగా దర్గా షరీఫ్‌కు భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. రాత్రి లంగర్ ఉంటుందన్నారు. మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ బాబాను దర్శనం చేసుకుని, ఆశీస్సులు పొందాలని కోరారు.

కలియుగ భీముడు కోడి రామమూర్తి

- విజయనగర కీర్తిని చాటి చెప్పిన ఘనుడు
- శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- ఘనంగా కోడి రామమూర్తి ఆరాధన ఉత్సవాలు



కలియుగ భీముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తదితరులు

విజయనగరం: బల ప్రదర్శన ద్వారా విజయనగర కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన మహోన్నత వ్యక్తి కలియుగ భీముడు కోడి రామమూర్తి నాయుడు అని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కొనియాడారు. కోడి రామ్మూర్తి ఆరాధన ఉత్సవాలలో భాగంగా కోడి రామమూర్తి వ్యాయామశాల జంక్షన్‌లో ఆయన నిలువెత్తు విగ్రహాన్ని కోలగట్ల ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆరాధన ఉత్సవాల సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కోడి రామమూర్తి విశిష్టతను వివరించారు. ప్రపంచంలో అత్యంత బలశాలిగా, కలియుగ భీముడిగా పేరు గాంచిన కోడి రామమూర్తి నాయుడు వ్యాయామ ప్రక్రియలు భావితరానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఆయన విగ్రహాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విజయనగరంలో కోడి రామ్మూర్తి వ్యాయామశాల అతి ప్రాచీనమైనదని, ఆధునిక పరికరాలతో ఎన్నో ప్రైవేటు వ్యాయామశాలలు నెలకొల్పినప్పటికీ కోడి రామమూర్తి వ్యాయామశాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. మూడు టన్నుల రోడ్డు రోలరును ఛాతిపై ఎత్తుకున్న బలశాలిగా ఇదే నగరానికి చెందిన పెద్ది లక్ష్మీనారాయణ మూర్తి పేరుగాంచారన్నారు. ఆనాడు అప్పుసాని అప్పన్న దొర ఈ వ్యాయామశాలను అభివృద్ధి చేశారని తర్వాత కాలంలో మరమ్మతులకు గురైన పరిస్థితిలో రూ.16 లక్షలతో వ్యాయామశాలలో మరమ్మతులు చేయించామన్నారు. నగరంలోని ప్రధాన జంక్షన్లలో వివిధ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో వ్యాయామశాల ప్రాంతంలో కోడి రామమూర్తి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో నగర మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, లయ యాదవ్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆసపు వేణు, వ్యాయా మ సమాజం అధ్యక్షురాలు పెనుమజ్జి విజయలక్ష్మి, కార్యదర్శి పెద్ది లక్ష్మీనారాయణ, పి.వి.నరసింహరాజు, రంగారావు దొర, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ ఎస్.బంగారనాయుడు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పండగ ఆదాయం రూ.64.62 లక్షలు



అప్పలనారాయణ, జిల్లా ప్రజా రవాణాధికారి

విజయనగరం అర్బన్: ఇటీవల వచ్చిన పండగల సీజన్‌లో జిల్లాలో ఆర్టీసీ రవాణా సేవలు పెరిగాయి. దీంతో ఆదాయం పెరిగింది. జిల్లాలో విజయనగరం, ఎస్.కోట ఆర్టీసీ డిపోల పరిధిలో సాధారణ సర్వీసులతో పాటు సంక్రాంతి, శంబర పండగలకు, దూర ప్రాంతాలకు నిర్వహించిన ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.64.62 లక్షల ఆదాయం సమకూరినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి విజయవాడ, హైదరాబాద్, వంటి ప్రధాన నగరాలకు 283 ప్రత్యేక బస్సులను కేవలం సాధారణ చార్జీలతో నడిపామని పేర్కొన్నారు. సంక్రాంతికి జిల్లాలోని ఎస్.కోట డిపో నుంచి నిర్వహించిన 41 బస్సుల సర్వీసుల ద్వారా రూ.9.96 లక్షలు, విజయనగరం డిపో నుంచి నిర్వహించిన 283 సర్వీసుల ద్వారా రూ.50.66 లక్షల ఆదాయం లభించిందని తెలిపారు.

● సంబరంగా.. 'ఆసరా'



డెంకాడ: వైఎస్సార్ ఆసరా సభకు అధిక సంఖ్యలో హాజరైన పొదుపు సంఘాల మహిళలు



వేపాడ: సభా ప్రాంగణంలో మహిళల కోలాటం

వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు సంబరంగా జరుగుతున్నాయి. జిల్లాలోని నెల్లిమర్ల నియోజకవర్గం డెంకాడ, ఎస్.కోట నియోజకవర్గం వేపాడ మండలాల్లో ఆదివారం ఈ ఉత్సవాలు జరిగాయి. సంబరాల్లో పాల్గొన్న నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మహిళలకు ఆసరా చెక్కులను అందజేశారు. డెంకాడ మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత కింద ప్రభుత్వం మంజూరు చేసినరూ.11.10 కోట్ల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. వేపాడ మండలంలోని 1020 మహిళా సంఘాల్లోని 11,663 మంది సభ్యులకు నాల్గవ విడత కింద మంజూరు చేసిన రూ.6.63 కోట్ల చెక్కును మహిళలకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు కోలాట నృత్యం ఆడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు కృతజ్ఞతాపూర్వకంగా క్షీరాభిషేకాలు చేశారు. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని మహిళలు ఆకాంక్షించారు. జగనన్న పాలనలో తమ జీవితాలు బాగుపడ్డాయని ఆయనకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

– డెంకాడ/వేపాడ

అడలి వ్యూ పాయింట్‌కు టెండర్ల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం అడలి వద్ద గల రెస్టారెంట్, క్యాంపింగ్ టెంట్లు, వ్యూ పాయింట్‌లకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పర్యాటక మండలి చైర్మన్, కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడలి వద్ద 1.34 ఎకరాల విస్తీర్ణంలో రెస్టారెంట్, క్యాంపింగ్ టెంట్లు, వ్యూ పాయింట్‌ల స్థలం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పర్యాటక ప్రదేశాలలో రెస్టారెంట్, క్యాంపింగ్ టెంట్లు, వ్యూ పాయింట్ నిర్వహణలో కనీసం మూడేళ్ళ అనుభవం కలిగిన ఆశక్తి గల వ్యక్తులు, సంస్థల నుంచి బిడ్స్ కోరుతున్నామని తెలిపారు. ఏడాదికి కనీస అద్దె రూ.25 లక్షలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా పర్యాటక మరియు సాంస్కృతిక అధికారి (జిల్లా కలెక్టర్ కార్యాలయం) కార్యాలయంలో, కార్యాలయపు పనిదినాలలో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 7వ తేదీవరకు ఉదయం 11 గంటలనుండి సాయంత్రం 3 గంటలవరకు దరఖాస్తు ఫారాలను పొందవచ్చునన్నారు.

క్లుప్తంగా

పోలమాంబ దర్శనానికి బారులు తీరిన భక్తులు





అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, (ఇన్‌సెట్లో) పూజలందుకుంటున్న పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము నుంచి భక్తులు గ్రామానికి చేరుకుని, చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వనం గుడిలో ఉన్న పోలమాంబ మేనత్త, పెదపోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. వనంగుడి వెనుకన ఉన్న వేప చెట్టుకు పూజలు చేశారు. అమ్మ దర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవదాయశాఖ సిబ్బంది మురళి తదితరులు చర్యలు చేపట్టారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో సత్తా





హారిక(తృతీయ స్థానం) వి.రాము(మొదటిస్థానం)

నెల్లిమర్ల రూరల్: ఈ నెల 19 నుంచి తమిళనాడులో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ క్రీడాకారులు సత్తా చాటారు. గ్రామానికి చెందిన వి.రాము 89 కేజీల విభాగంలో ఆదివారం పోటీలో పాల్గొని స్నాచ్ 126 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 166 కిలోలు, మొత్తంగా..292 కేజీల బరువును ఎత్తి మొదటి స్థానం కైవసం చేసుకున్నాడు. అలాగే మరో క్రీడాకారిణి బెల్లాన హారిక 59 కేజీల విభాగంలో పాల్గొని స్నాచ్ 73 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 93 కిలోలు, మొత్తంగా 166 కిలోల బరువు ఎత్తి తృతీయస్థానంలో నిలిచింది. పతకాలు సాధించిన వెయిట్ లిఫ్టర్లకు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

సత్తా చాటిన వస్తాదులు

- ఆకట్టుకున్న సంగిడి రాళ్ల పోటీలు



సత్తా చాటిన వస్తాద్ వెంకటేష్

వేపాడ: వేపాడ గ్రామదేవతల తీర్థం సందర్భంగా నిర్వహించిన సంగిడి రాళ్ల పోటీల్లో విజయనగరం, విశాఖ అనకాపల్లి జిల్లాలకు చెందిన వస్తాదులు పాల్గొన్నారు. గోపాలకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు రూ.6వేలు, రూ.నాలుగువేలు, రూ.రెండువేల ఐదువందలు నగదు బహుమతులను అందజేశారు. విసురు, పోటు, తీత విభాగాల్లో విజయనగరం జిల్లా అంబటివలసకు చెందిన పి.వెంకటేష్ ప్రథమస్థానంలో నిలిచాడు. అలాగే రామచంద్రపేటకు చెందిన బి.గోవింద పోటు, తీత, విసురు విభాగాల్లో ద్వితీయస్థానం సాధించాడు. రామచంద్రంపేటకు పి.శ్రీను విసురులో మూడోస్థానంలో నిలిచాడు. గరుడబిల్లికి చెందిన ఎస్.శ్రీను పోటు, తీతలో తృతీయస్థానం సాధించాడు. ఈ పోటీల్లో వస్తాదులు 30 కేజీల రాయినుంచి 130 కేజీల బరువున్న సంగిడి రాళ్లను ఎత్తి సత్తా చాటారు.

పంటలు ధ్వంసం చేసిన ఏనుగులు



కిచ్చాడ పరిసరాల్లో అరటి తోటల్లోకి వెళ్తున్న ఏనుగుల గుంపు

కురుపాం: మండలంలోని కిచ్చాడ గ్రామ పరిసరాల్లో శనివారం సాయంత్రం ప్రవేశించిన ఏనుగుల గుంపు ఇంకా గ్రామ పరిసరాల్లోనే తిష్ఠవేసినట్లు సర్పంచ్ గవర రాజేశ్వరి తెలిపారు ఆదివారం పంచాయతీ పరిధిలోని పామాయిల్, మొక్కజొన్న, అరటి తోటలను ధ్వంసం చేశాయని గ్రామానికి చెందిన రైతులు ఉమామహేశ్వరరావు, అప్పలనాయుడు, నిర్మలతోపాటు ఇతర రైతులు వాపోయారు. అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని సర్పంచ్, బాధిత రైతులు కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

ఆక్వా రైతుకు బీమాతో ధీమా

- సాగురైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం
- విద్యుత్ చార్జీల తగ్గింపు
- రాయితీలు, ఇన్సూరెన్స్ కల్పించడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం
- రొయ్యధరపై అధికారుల పర్యవేక్షణ
- ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



కోనాడలో ఆక్వాసాగు చెరువు

పూసపాటిరేగ: ఆక్వాసాగుకు ప్రభుత్వం అండగా ఉండడంతో సాగు విస్తీర్ణం అమాంతం పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆక్వారైతులను అన్ని విధాలా ఆదుకోవడంతో పాటు రాయితీలు, ఇన్‌స్రూ ప్రకటించింది. రైతుల నుంచి కొనుగోలు చేసే రొయ్యల ధర తగ్గించడానికి వ్యాపారులు సిండికేట్ అవడంతో ప్రభుత్వం భగ్నం చేసి మద్దతు ధర కల్పించడానికి చర్యలు చేపట్టింది. రైతులకు అండగా ఉండేందుకు మత్స్యశాఖ అధికారులు నిత్యం ధరలను పర్యవేక్షణ చేస్తూ రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. రొయ్యల ఉత్పత్తికి అయ్యే ఖర్చుల కంటే అమ్మకం ధర అధికంగా వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ ఆథారిటీ ద్వారా ఆక్వాసాగు క్రమబద్ధీకరణ, నాణ్యమైన మేత సరఫరా చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఆక్వారైతులకు బీమా సదుపాయం కల్పించి ధీమాగా సాగు చేయడానికి చర్యలు తీసుకుంది. ఈ మేరకు జిల్లాలో 49 మంది రైతులు 175.37 హెక్టార్లలో ఆక్వా సాగు చేస్తున్నారు. 2022-23 సంవత్సరానికి గాను 350 టన్నుల రొయ్యల ఉత్పత్తి జరిగింది..

జోన్‌లో సాగుకు రాయితీలు

జిల్లాలో తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురంలలో ఆక్వాజోన్‌లో ఉండి 10 ఎకరాల లోపు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలు ప్రకటించింది. యూనిట్ విద్యుత్ ధర 1.50 పైసలకే అందజేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో యూనిట్ విద్యుత్ ధర రూ.3 చేయడంతో విద్యుత్ చార్జీలు చెల్లించలేక రైతులు సాగును వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు విద్యుత్ చార్జీలు తగ్గించడంతో సాగు విస్తీర్ణం అమాంతం పెరిగింది. .

ఆక్వాసాగుకు బీమా

ఆక్వాసాగుకు ప్రభుత్వం తాజాగా బీమా సదుపాయం కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో బీమా పాలసీ కల్పించడానికి కేంద్రం పైలట్ ప్రాజెక్టుగా ఏపీ రాష్ట్రాన్ని ఎంపిక చేసింది. సాగులో ఎటువంటి నష్టం జరిగినా రైతులకు ఇన్‌స్రూ కల్పించేందుకు ప్రభుత్వమే చర్యలు తీసుకుంటుంది. ఈనెల 30 న ఉత్తరాంధ్ర ఆక్వారైతులకు విశాఖలో మత్స్యశాఖ అధ్వర్యంలో భీమా పాలసీలపై అవగాహన కల్పించనున్నారు.

వనామి సాగుకు ఆసక్తి

జిల్లా ఆక్వారైతులు వనామి రొయ్యల సాగుకు ఆసక్తి చూపిస్తున్నారు. వనామిసాగు అనుకూలంగా ఉండి దిగుబడులు పెరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రతి ఏడాది జనవరి నుంచి మార్చి నెల వరకు ధరలు బాగా ఉంటాయని , ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ధరలు తగ్గి రైతులకు కొంత మేర లాభాలు తగ్గుతున్నాయని, నవంబరు నుంచి జనవరి వరకు ధరలు బాగా వస్తాయని ఆక్వా రైతులు తెలియజేస్తున్నారు.

సాగు విస్తీర్ణం పెరిగింది



ఆక్వా రైతులకు సరఫరా చేసే విద్యుత్ చార్జీలను గత టీడీపీ ప్రభుత్వం పెంచింది. దీని కారణంగా చాలా మంది రైతులు ఆక్వాసాగుకు దూరమయ్యారు. ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ ఆథారిటీ ద్వారా ఆక్వాజోన్‌లకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. దీని కారణంగా ఆక్వాసాగు అమాంతం పెరిగింది. ప్రభుత్వమే సాగు ద్వారా వచ్చే ఉత్పత్తిపై దృష్టిసారించి రైతులకు మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటోంది.

అమర బుజ్జి, ఆక్వారైతు కోనాడ

మద్దతు ధరకే కొనుగోలు



ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా ఉంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయాలని పరిశ్రమ యాజమాన్యాలు, ప్రాసెసింగ్ ల్యాబ్‌లు, వ్యాపారులను ఆదేశించాం. ఆక్వా రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆక్వారైతులకు బీమా పాలసీ ప్రకటించడంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

నిర్మలాకుమారి, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయనగరం

2.75 లక్షల మెట్రిక్ టన్నుల క్రషింగ్ పూర్తి



రేగిడి : ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్

రేగిడి : మండలంలోని సంకిలి ప్యారీ ఈఐడీ చక్కెర కర్మాగారంలో 2.76 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ పూర్తి చేశామని కర్మాగారం సీనియర్ అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎ.నాగిశేషారెడ్డి ఆదివారం తెలిపారు. ప్రతీ రోజు 4 వేల మెట్రిక్ టన్నుల చొప్పున చెరకు గానుగ ఆడుతున్నామని వివరించారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి చెరకు ప్యారీ ఈఐడీకు క్రషింగ్‌కు వస్తుందని తెలిపారు. చెరకును తీసుకొచ్చిన రైతులకు 15 రోజుల వ్యవధిలో బిల్లులు చెల్లింపులు చేస్తున్నామని పేర్కొన్నారు. 4.10 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ చేయాల్సి ఉందన్నారు. సగానికి పైగా క్రషింగ్ లక్ష్యం పూర్తయిందని వెల్లడించారు. చెరకును తరలించే సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు.

హోరాహోరీగా ఎడ్ల పరుగు ప్రదర్శన



పరుగు ప్రదర్శనలో టైరు బండ్ల ఎడ్లు

వేపాడ: మండలకేంద్రం వేపాడ గ్రామదేవతలు పరదేశమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల తీర్థ మహోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన టైరు బండ్ల ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగింది. టైరు బండ్ల ఎడ్ల పరుగు ప్రదర్శనలో ఎనిమిది ఎడ్ల జతలు పాల్గొన్నాయి. వాటిలో వేపాడకు చెందిన ఆదపురెడ్డి రమణ ప్రథమ స్థానంలో నిలిచి రూ.ఎనిమిది వేలు, రెండోస్థానంలో నిలిచిన వల్లంపూడికి చెందిన మజ్జి చిన అప్పారావు రూ.ఐదువేలు, మూడోస్థానంలో నిలిచిన వల్లంపూడి ఎడ్ల యజమాని ఉల్లి శ్రీను రూ.మూడు వేలు, నాల్గోస్థానంలో వేపాడకు చెందిన రెడ్డి ఎరునాయుడు ఎడ్లకు రూ.2 వేలు, ఐదోస్థానంలో నిలిచిన నిరుజోగి కొండబాబు ఎడ్లకు రూ.1 వేయి చొప్పున నగదు బహుమతులను గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు. అలాగే తీర్థమహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీల్లో 30 జట్లు పాల్గొనగా మొదటిగా గాజువాక లైన్స్ 'తలారి' జట్లు తలపడ్డాయి.

'మన్యంలో మధురకోకిల' పుస్తకావిష్కరణ



మన్యంలో మధురకోకిల పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు జీఎస్.చలం తదితరులు

విజయనగరం టౌన్: కవులు, రచయితలు తమ రచనలను కలకాలం కొనసాగించాలని అరసం జిల్లా అధ్యక్షుడు జీఎస్.చలం పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక అయ్యన్నపేట కామాక్షినగర్‌కు చెందిన కోరుపోలు కళావతి రచించిన 'మన్యంలో మధురకోకిల' పుస్తకాన్ని ఆమె స్వగృహంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సాధారణ గృహిణిగా ఉంటూనే కళావతి తన సాహిత్య సృజన కొనసాగించారని ప్రశంసించారు. నేటి యువతరం ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వాస్తవ సంఘటన తీసుకుని రాసిన కథ మన్యంలో మధురకోకిల అని అభివర్ణించారు. స్త్రీలు ఆత్మస్థైర్యంతో జీవించాలని తన రచనలో పొందుపరిచారన్నారు. అనంతరం సాహితీవేత్తలు ఆమెను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏఎస్.ప్రకాశరావు, త్రినాథరావు, అన్నపూర్ణ, హరి, తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ కోసం పార్లమెంటులో చర్చించండి

- ఎంపీ బెల్లానకు వినతిపత్రం



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఈపీఎఫ్ సంఘం నాయకులు

చీపురుపల్లి: ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్(ఈపీఎఫ్) పెన్షన్ పెంపుదల కోసం పార్లమెంటులో చర్చించి న్యాయం చేయాలని ఈపీఎఫ్ సంఘం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను కోరింది. ఈ మేరకు ఆదివారం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నివాసంలో ఆయనను కలిసిన ఈపీఎఫ్ సంఘం వినతిపత్రం అందజేసింది. దేశ వ్యాప్తంగా ఈపీఎఫ్ కార్మికులకు న్యాయమైన పెన్షన్ రావడం లేదని, దీని కోసం జాతీయ కమిటీ ఢిల్లీలో నెల రోజులుగా ఆందోళన కొనసాగిస్తోందని చెప్పారు. అయితే ఫిబ్రవరి 5న పార్లమెంటు క్వశ్చన్ అవర్‌లో దీనిపై చర్చకు వస్తుందని ఆ సమయంలో ఈపీఎఫ్ కార్మికుల కోసం చర్చించాలని వారు ఎంపీని కోరారు. దేశవ్యాప్తంగా ఈపీఎఫ్ పెన్షన్ వచ్చిన కార్మికులు 75 లక్షల మంది ఉన్నారని వారిలో చాలా తక్కువ మందికి ఈపీఎఫ్ పెన్షన్ వస్తోందని అందులోనూ నెలకు రూ.500 నుంచి రూ.800 వరకు మాత్రమే వస్తోందని ఆవేదన వ్యక్తం చేసారు. తమకు నెలకు కనీసం రూ.7,500 పెన్షన్‌తో బాటు డీఏ ఇవ్వాలని, ఉచిత వైద్యం అందించాలని కోరుతున్నట్లు చెప్పారు. ఇదే అంశంపై పార్లమెంటులో చర్చించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈపీఎఫ్ సంఘం నాయకులు అంబళ్ల గౌరునాయుడు, కొణిశ కృష్ణంనాయుడు, ఉత్తరావల్లి ప్రకాశ్, అప్పలరాజు, జగదీశ్వరరావు, రామయ్య పాల్గొన్నారు.

స్కూటీ అదుపుతప్పి అధ్యాపకుడి మృతి



మురళీకృష్ణ (ఫైల్)

జియ్యమ్మవలస /కురుపాం: చినమేరంగి జూనియర్ కళాశాలలో ఫిషరీష్‌లో కాంటాక్ట్ అధ్యాపకుడుగా పని చేస్తున్న ముడిలి మురళీకృష్ణ(50) బైక్ అదుపుతప్పి మృతిచెందారు. ఈ మేరకు కురుపాం ఎస్సై షణ్ముఖరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చినమేరంగి గ్రామానికి చెందిన మురళీకృష్ణ గుమ్మలక్ష్మీపురం నుంచి స్కూటీపై వస్తూ కురుపాం మండలం మూలిగూడ జంక్షన్ దగ్గరలో గల స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడికి భార్యతో పాటు పెళ్లైన కుమార్తె ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతులను పారిశ్రామిక వేత్తగా తయారు చేయడానికి కృషి

- మెసానిక్ టెంపుల్లో రైతు సదస్సు



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనుబాబు

విజయనగరం ఫోర్ట్: రైతులను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడానికి కృషి చేస్తున్నట్టు పల్సెస్ సంస్థ ఎం.డి గేదెల శ్రీనుబాబు అన్నారు. ఈ మేరకు స్థానిక మెసానిక్ టెంపుల్‌లో ఆదివారం నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ గడిచిన 30 ఏళ్లలో ఉత్తరాంధ్ర నుంచి 8 లక్షల నుంచి 10 లక్షల మంది వలస వెళ్లిపోయారని తెలిపారు. ఆర్థికంగా రైతు బలపడితే వలసలు తగ్గించవచ్చునని అభిప్రాయ పడ్డారు. సేంద్రియ ఉత్పత్తులపై విస్తత ప్రచారం కల్పించి మార్కెటింగ్ చేయగలిగితే రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని చెప్పారు. 1991 నాటికి జిల్లాలో 6 లక్షల మంది రైతులు ఉంటే ప్రస్తుతం 3.50 లక్షల మంది రైతులు మాత్రమే ఉన్నారని చెప్పారు. ప్రజలు వలస వెళ్లి పోవడం వల్ల జిల్లాలో నియోజకవర్గాల సంఖ్య కూడా తగ్గిపోయిందన్నారు. గతంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 23 నియోజకవర్గాలు ఉంటే ప్రస్తుతం 19 మాత్రమే ఉన్నాయని, నాలుగు నియోజకవర్గాలు తగ్గాయన్నారు. ఆహార సంబంధిత పరిశ్రమలు పెట్టగలిగితే రానున్న 10 ఏళ్లలో 70 వేల మంది వరకు ఉపాధి కల్పించవచ్చునని చెప్పారు. రానున్న రోజుల్లో నియోజకవర్గం, మండలకేంద్రాల్లో రైతు సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. సుస్థిర వ్యవసాయ ఆర్థిక కారిడార్ ఏర్పాటు చేస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో 10 లక్షల ఎకరాలు గతంలో ఉండేవని ప్రస్తుతం 6లక్షల నుంచి ఆరున్నర లక్షల ఎకరాలు మాత్రమే సాగులో ఉన్నాయని, అందులోను వ్యవసాయ అధారిత పంటలు సాగు చేసేది నాలుగున్నర లక్షల ఎకరాల్లో నేనన్నారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్‌ఛైర్మన్ మామిడి శ్రీకాంత్, మజ్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అబ్బూరి

- కేంద్రసాహిత్య అకాడమీ తెలుగువిభాగం కన్వీనర్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రసాహిత్య అకాడమీ తెలుగువిభాగం కన్వీనర్ మృణాళిని

రాజాం సిటీ: తెలుగు సాహిత్యంలో మరుగునపడిన మాణిక్యం అబ్బూరి వరదరాజేశ్వరరావు అని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగువిభాగం కన్వీనర్ సి.మృణాళిని కొనియాడారు. ఈ మేరకు ఆదివారం స్థానిక జేజే ఇనోటెల్‌లో కేంద్రసాహిత్య అకాడమీ, రాజాం రచయితల వేదిక సంయుక్తంగా అబ్బూరి వరదరాజేశ్వరరావు శతజయంత్యుత్సవ సభ నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె అధ్యక్షోపన్యాసం చేశారు. అబ్బూరి బహుముఖ ప్రజ్ఞాశాలి అని, అనాటి శ్రీశ్రీ, ఆరుద్ర, జరుక్ శాస్త్రి, జాషువా, విశ్వనాథ సత్యనారాయణ,వంటి కవుల మధ్య తిరుగాడుతూ నిత్యం సాహిత్య చర్చలలో పాల్గొనే వారని గుర్తుచేశారు. బందరు, గుంటూరు, ఢిల్లీ, వైజాగ్ ఇలా ఎక్కడ నివశించినా కవిత్వం, రచనలలో నూతనత్వం కోరుకునేవారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ ఛైర్మన్, రచయిత డాక్టర్ డీవీజీ శంకరరావు మాట్లాడుతూ సాహిత్యం సమాజానికి దర్పణమని, సమాజంలో జరిగే మార్పులకు సాహిత్యం మార్గదర్శిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాజాంలో కేంద్రసాహిత్య అకాడమీ సదస్సు నిర్వహించడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఇలాంటి సదస్సులు వర్ధమాన రచయితలు, కవులను ప్రోత్సహించేందుకు చక్కని అవకాశమని అభిప్రాయపడ్డారు. నాలుగు సమావేశాలుగా జరిగిన ఈ సదస్సులో రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం ముఖ్యఅతిథిగా ప్రసంగించగా చింతకింది శ్రీనివాసరావు, సమ్మెట నాగమల్లేశ్వరరావు, ఎం.కృష్ణకుమారి, అవధానుల మణిబాబు, ఆల్తి మోహనరావు, పిల్లా తిరుపతిరావు, ఒమ్మి రమణమూర్తి, బాల సుధాకర్‌మౌళి తదితరులు అబ్బూరి వరదరాజేశ్వరవు జీవిత సాహిత్యాలపై పత్ర సమర్పణలు చేశారు. కార్యక్రమంలో గంటేడ గౌరునాయుడు, మల్లిపురం జగదీష్, సిరికి స్వామినాయుడు, చీకటి దివాకర్, దాసుబాబు, పొన్నాడ నర్సింహులు, పెంకి దయానిధినాయుడు, పొట్నూరు కోటిబాబు, రాజాపు శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థం సేవాసంఘం సేవలు ప్రశంసనీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

నెల్లిమర్ల రూరల్/విజయనగరం పూల్‌బాగ్: రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానం అభివృద్ధే లక్ష్యంగా రామతీర్థం సేవా సంఘం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. ఈ మేరకు విజయనగరం పట్టణంలో రామతీర్థం సేవా సంఘం నూతన కార్యవర్గ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ సేవా సంఘం తరపున రామతీర్థం పరిసర ప్రాంతాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఉత్సవ సమయాల్లో విశేష సేవలు అందిస్తున్నారని కితాబిచ్చారు. సభ్యుల ఆమోదం మేరకు పాత కార్యవర్గాన్నే కొనసాగిస్తున్నట్లు సేవా సంఘం సభ్యులు తెలిపారు. అనంతరం అయోధ్య బాల రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా నెల్లిమర్ల నుంచి రామతీర్థం వరకు జరిగిన శోభాయాత్రకు ఆర్థిక సహకారం అందించిన బడాన రాజశేఖర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు రేగాన గోవిందరావు, సుదర్శన విజయ్‌కుమార్, బాలాజీ, సముద్రపు రామారావు, ఆల్తి శ్రీనివాసరావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

గురుకులానికి ఆహ్వానం

- ఐదోతరగతి, ఇంటర్‌మీడియట్‌లో ప్రవేశాలు
- ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ
- ఫిబ్రవరి 23వరకూ గడువు



నెల్లిమర్లలోని అంబేడ్కర్ గురుకులం

విజయనగరం పూల్‌బాగ్: పేద, మధ్యతరగతి, ఆర్థికంగా వెనుకబడిన సామాజికవర్గాల్లోని పిల్లలు చదువుకోవాలనుకునేవారిని అంబేడ్కర్ గురుకులం రారమ్మని పిలుస్తోంది. ఉచిత విద్య అందించేందుకు ఐదోతరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. కార్పొరేట్ తరహాలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఫిబ్రవరి 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక సారి సీటు పొందితే వసతితో పాటు ఇంటర్మీడియట్ వరకూ ఉచితంగా చదువుకునే అవకాశం కలుగుతుంది. ఆంగ్లమాధ్యమంలో బోధనతో పాటు నీట్/ఐఐటీల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారు. విద్యార్థులు మార్చి 10న జరిగే కామన్ టాలెంట్ ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ చూసి ప్రవేశాలు పొందవచ్చు.

అర్హతలు ఇవీ..

ఐదోతరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబరు 1నుంచి 2015 ఆగష్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టడ్ క్రిస్టియన్(బీసీ-సీ) విద్యార్థులు 2013 సెప్టెంబరు1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. జూనియర్ ఇంటర్‌మీడియట్ ప్రవేశాలకు 2023-24 ఏడాదిలో పదోతరగతి పరీక్షకు హాజరవుతున్న వారు అర్హులు. వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు దాటకూడదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం,సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సడలింపు ఉంటుంది. విద్యార్థులు సొంత జిల్లాలో 2022-23 ఏడాదిలో 3వతరగతి, 2023-24 ఏడాదిలో 4వతరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదవాలి. దరఖాస్తు చేసుకోనున్న విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష దాటకూడదు. ప్రవేశ పరీక్ష షెడ్యూల్: ఐదోతరగతి ప్రవేశ పరీక్ష మార్చి10,2024, ఉదయం 10గంటల నుంచి 12వరకు ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరం ప్రవేశ పరీక్ష మార్చి10,2024,మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30వరకు

దరఖాస్తు చేసుకునే విధానం

విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.ఐదో తరగతి, ఇంటర్‌కు హెచ్‌టీటీపీఎస్://ఏపీబీఆర్ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్. ద్వారా ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 23లోగా దరఖాస్తు చేసుకోవాలి.విద్యార్థి ఎంపిక చేసుకున్న పాఠశాల/కళాశాల వివరాలను తప్పనిసరిగా రాయాలి. వివరాలు సబ్మిట్ చేసిన తరువాత మార్చుకోవడానికి అవకాశం ఉండదు.

మార్కుల ఆధారంగా సీట్లు కేటాయింపు



రెండు జిల్లాల్లో ఉన్న 13 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఐదు, ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న బాలురు, బాలికలకు మార్చి 10న నిర్వహించేప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నాం. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇది చక్కని అవకాశం. సద్వినియోగం చేసుకోవాలి

– టి పద్మజ, జిల్లా సమన్వయకర్త, గురుకుల విద్యాలయాల సంస్థ, ఉమ్మడి విజయనగరం జిల్లా